క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం సోమవర్పపాడు పంచాయితీ పరిధిలో ఉన్న ప్రసిద్ధ పుణ్య క్షేత్రం గుంటిగంగ భవాని అమ్మవారు, మల్లికార్జునస్వామి, నాగమ్మ తల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టి, నైవేద్యాలు ప్రసాదాలు పెట్టుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని అర్చకులు పి.విజయ లక్ష్మి, ఎం.బాలరాజు, కామేశ్వర శర్మ అలంకరించారు. ఈఓ గుంటపల్లి, వాసు, ప్రసాద్‌రావు, ఆలయ చైర్మన్ కె.గురు బ్రహ్మం పాల్గొని భక్తులకు వసతులు సమకూర్చారు.

వెలుగొండకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు సోమయ్య

పెద్దదోర్నాల: సవరించబోతున్న రాష్ట్ర బడ్జెట్‌లో వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దగ్గుపాటి సోమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత నెల 28వ తేదీన ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. బడ్జెట్‌లో ప్రాజెక్టుకు కేవలం రూ.359 కోట్లు మాత్రమే కేటాయించారని, ఈ సమావేశాలలో బడ్జెట్‌ను సవరించి ప్రాజెక్టుకు రెండు వేల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రకాశానికి వరప్రసాదయిని అయిన వెలుగొండను నిర్లక్ష్యం వహించటం సరికాదన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండేళ్లల్లో ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారన్నారు. కొద్ది పాటి నిధులతో నీరు విడుదలకు అవకాశం ఉన్న ప్రాజెక్టు వెలుగొండ ప్రాజెక్టు ఒక్కటేనన్నారు. పశ్చిమ ప్రాంత ఎమ్మెల్యేలు అసెంబ్లీలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకొని బడ్జెట్ సవరింపులకు ప్రయత్నం చేయాలని లేదంటే ప్రజా వ్యతిరేకత తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, శీలం యేసోబు, గోదా దావీదు, పానుగంటి పిచ్చయ్య, శీలం యేసన్న, కదిరి సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

సేవా సంస్థకు వాహనం వితరణ



స్వచ్ఛంద సంస్థకు వాహనం అందజేస్తున్న దేవతి బ్రదర్స్

దర్శి (కురిచేడు): ఓ స్వచ్ఛంద సేవా సంస్థకు రూ.6.5 లక్షల విలువైన వాహనాన్ని బహూకరించారు. ఆదివారం స్థానిక హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద మానవతా స్వచ్ఛందకు దాతలు దేవతి ప్రసాదు, భాస్కర్, మహానంది, రామారావులు వాహనాన్ని సంస్థ కార్యవర్గ సభ్యులకు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి కే ఎలమందరెడ్డి హాజరై మాట్లాడుతూ మానవత సంస్థకు దేవతి బ్రదర్స్ వాహనం అందజేయడం అభినందనీయమన్నారు. శాంతి రథాన్ని త్వరలోనే నిర్మాణం చేసి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వెంకటరెడ్డి, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, కోశాధికారి గొర్రెపాటి వేణు, వివిధ విభాగాల డైరెక్టర్లు ఖాదర్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరబెట్టిన మిర్చి చోరీ



త్రిపురాంతకం: పంటను కోసి ఆరబెట్టుకున్న మిరప కాయలను దొంగలు ఎత్తుకుపోయారు. ఈ ఘటన మండలంలోని కంకణాలపల్లిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..కంకణాలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన బోయలపల్లి గాలయ్య తన 3 ఎకరాల పొలంలో మిర్చి సాగుచేశాడు. రెండు కోతల్లో వచ్చిన 30 క్వింటాళ్ల మిర్చిని పొలంలోనే ఆరబెట్టాడు. రైతు నిత్యం ఉదయం ఆరబెట్టిన మిర్చిని రాత్రి పట్టలతో కప్పి కాపలాగా అక్కడే పడుకునేవాడు. ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో శనివారం ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం పట్టలు తొలగించి మిర్చిని ఎత్తుకెళ్లారు. దాదాపు 15 క్వింటాళ్ల దొంగలు ట్రాక్టర్‌తో వచ్చి ఎత్తుకొని వెళ్లినట్లు గుర్తించారని, రైతు గాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు.

పేరులో పెద్ద.. అభివృద్ధిలో చిన్న!

రాష్ట్రంలో పెద్దదోర్నాలకు పెద్ద చరిత్రే ఉంది. ఆధ్యాత్మిక కేంద్రం శ్రీశైలానికి ముఖద్వారం లాంటిది. రాష్ట్రంలో ప్రతి డిపో నుంచి వచ్చిన బస్సులు , ఇతర వాహనాలు దోర్నాల మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉంటుంది. మరో విశేషమైన వెలుగొండ ప్రాజెక్టు కూడా ఉంది. ఇంత ప్రాధాన్యత ఉన్న పెద్ద దోర్నాలలో సరైన బస్టాండ్ లేదంటే నమ్మాల్సిందే. అటు కూటమి ప్రభుత్వం.. ఇటు అధికారుల నిర్లక్ష్య వైఖరితో అభివృద్ధిలో వెనుకంజలో ఉంది పెద్దదోర్నాల. ప్రైవేటు వాహనాలు, ఆటోల కారణంగా ఆర్టీసీకి గండిపడుతోంది..

- ఆర్టీసీ ఆదాయానికి గండి
- దోర్నాల ఆర్టీసీ బస్టాండ్‌లో కరువైన పర్యవేక్షణ
- జీపులు, ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



ఆటోలతో నిండి ఉన్న పెద్దదోర్నాల ఆర్టీసీ బస్టాండ్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పర్యవేక్షణ లోపించటంతో ఆర్టీసీ ఆదాయానికి తీవ్రంగా గండి పడుతోంది. నిత్యం వందలాది బస్సులు రాకపోకలు సాగించే పెద్దదోర్నాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ కంట్రోలర్‌ను సైతం నియమించకపోవడం అధికారుల నిర్లక్షానికి అద్దం పడుతోంది. గత కొద్ది రోజుల క్రితం ఇక్కడ కంట్రోలర్‌గా విధులు నిర్వహించిన ఓ ఉద్యోగి ఇటీవల క్రితం ఉద్యోగ విరమణ చేశాడు. అప్పటి నుంచి ఇక్కడ ఖాళీ ఏర్పడింది. అయితే ఆ ఖాళీని అధికారులు భర్తీ చేయకపోవటంతో ప్రైవేటు వాహనదారులకు వరంగా మారింది. దీంతో ఆటోలు, జీపులతో ప్రైవేటు వాహనదారులు తమ ఇష్టారీతిన ప్రయాణికులను ఎక్కించుకుని పలు ముఖ్యమైన రూట్లలో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.

ఆర్టీసీ అధికారుల నిలువెత్తు నిర్లక్ష్యం..

రాష్ట్రంలో 24 గంటలు బస్సు సర్వీసులు నడిచే జంక్షన్‌గా పెద్దదోర్నాలకు పేరుంది. దీంతో పాటు రాష్ట్రంలోని అన్ని సుదూర ప్రాంతాలకు ఇక్కడి నుంచి బస్సు సౌకర్యం ఉంది. తెలంగాణా, కర్నాటక రాష్ట్రానికి సంబంధించి ఎన్నో సర్వీసులు క్రమం తప్పకుండా ఇక్కడి నుంచి నడుస్తుంటాయి. ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తి పీఠంగా వెలుగొందుతున్న శ్రీశైల పుణ్యక్షేత్రానికి ముఖద్వారంగా ఉన్న పెద్దదోర్నాలలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడకూడదన్న ఒక్క కారణంతోనే ఇక్కడ బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. అయితే బస్టాండ్‌లో ఆర్టీసీ కంట్రోలర్‌ను నియమించక పోవడంతో ఆటోలు, జీపులు తమ ఇష్టారాజ్యంగా ప్రయాణికులను ఎక్కించుకుని దర్జాగా తిరుగుతున్నాయి. దీంతో పాటు మార్కాపురం, దోర్నాలకు తిరిగే బస్సులకు కూడా సమయపాలన లేకుండా పోతుందని, చాలాసార్లు కొన్ని బస్సులు సమయానికి ముందే వెళ్లి పోతున్నాయిని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు వాహనాలదే రాజ్యం..

ఆర్టీసీ బస్టాండ్‌కు కనీసం 500 మీటర్లలోపు ప్రైవేటు వాహనం నిలుపకూడదని, ప్రయాణికులను తరలించకూడదని నిబంధనలు ఉన్నా, అధికారుల నిర్లక్ష్యంతో నిబంధనలు పట్టించుకోవడం లేదు. దీంతో బస్టాండ్‌లో అధికారుల పర్యవేక్షణ లేక పోవటంతో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోకి నేరుగా జీపులు, ఆటోలు వచ్చి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సిన ప్రయాణికులను తమ ఆటోలో ఎక్కించుకుని వెళ్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా ఆర్టీసీ సంస్థకు నష్టం వాటిల్లుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆర్టీసీ బస్టాండ్‌లో సిబ్బందిని నియమించడంతో పాటు బస్సులు సమయ పాలనతో ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

> **ఆర్టీసీ బస్టాండ్‌లో సిబ్బందిని నియమించాలి..**
>
> 
>
> ఆర్టీసీ బస్టాండ్‌లో సిబ్బంది పర్యవేక్షణ ఉండాలి. సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు వాహనాలు ఇష్టారీతిలో ప్రయాణికులను ఎక్కించుకుని ప్రయాణాలు చేస్తున్నారు. అనునిత్యం ప్రయాణికులతో రద్దీగా దోర్నాల ఆర్టీసీ బస్టాండ్‌లో సిబ్బంది ఎంతో అవసరమని అధికారులు గుర్తించాలి.
>
> – జోగి వెంకటనారాయణ, పెద్దదోర్నాల

పైపులకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

తాళ్లూరు: పత్రికల్లో కథనాలు ప్రచురిస్తే తప్ప అధికారులు పని చేయడం లేదు. మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో దర్శి–చీమకుర్తి ప్రధాన రహదారిలో డీప్ బోర్ పైపు లైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతూ రోడ్ల మీదకు చేరి వాహనదారులు, దుకాణదారులు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఇబ్బందుల గురించి గత నెల 10 తేదీన సాక్షి దినపత్రికలో 'పట్టించుకోండి ప్లీజ్ !' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. స్పందించిన పంచాయతీ అధికారులు పైపు మరమ్మతుల పనులు చేసి నీటిని వృథా కాకుండా చూశారు. దీంతో గ్రామ ప్రజలు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



పైపులకు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

బాలికల చదువుతో సమాజానికి మేలు



పుల్లలచెరువు కేజీబీవీలో యోగా చేస్తున్న బాలికలు



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై అనిల్‌కుమార్

పెద్దారవీడు: బాలికలు మంచిగా చదువుకొని సమాజానికి, దేశానికి ఎంతో ఉపయోగపడాలని ఎస్సై పీ అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ చదువుకునే వయస్సులో చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాలికలు తప్పనిసరిగా స్వీయరక్షణ కలిగి ఉండాలని, ఎదుటి వారి నుంచి తమను తాము రక్షణ నైపుణ్యాలు, ధృఢంగా ఉండాలన్నారు. మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైమ్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం మనం టెక్నాలజీ యుగంలో ఉన్నామని సైబర్ భద్రత నియమాలలో భాగంగా స్మార్ట్ మొబైల్స్ ఎక్కువగా వాడకూడదని, వాటి వలన సైబర్ క్రైమ్ లాంటి నేరాలు జరగడానికి అవకాశం ఉందన్నారు. అవసరంలేని యాప్‌లు, ఫోన్‌కు వచ్చే లింకులు సెలెక్ట్ చేయవద్దన్నారు. అత్యవసర సమయంలో సహాయం కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్ లెన్ 181, పోలీస్ హెల్ప్ లైన్ 100 లేక 112, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930, పోలీస్ కంట్రోల్ రూమ్ 91211 02266 నంబరులకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బాలికలు, మహిళా పోలీసుల పాల్గొన్నారు.

ధ్యానం, యోగతో ఏకాగ్రత సాధ్యం

పుల్లలచెరువు: విద్యార్థులు ధ్యానం, యోగా నేర్చుకోవడంతో ఏకాగ్రత, మానసిక ప్రశాంతత ఉంటుందని పుల్లలచెరువు ఎస్ఐ సంపత్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మహిళా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా బాలికలకు యోగా, మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ధ్యానం, యోగా నేర్చుకోవడంతో వారిలో ఏకాగ్రత, మానసిక ప్రశాంతత కలిగి చదువుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. దాంతో ప్రతి వారిలో క్రమశిక్షణ కూడ అలవడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొంతెండుతున్న పోతంపల్లి



ట్యాంకర్‌పై నుంచి బిద్దెలతో నీటిని తీసుకుంటున్న ప్రజలు



పోతంపల్లి చర్చి దగ్గర భూగర్భ జలాలు అడుగంటిన సింగిల్ ఫేసు బోరు

- పట్టించుకోని అధికారులు
- తాగునీరు లేక అల్లాడుతున్న గ్రామస్తులు

పెద్దారవీడు: పశ్చిమ ప్రకాశం తాగునీటికి అల్లాడుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు ఇక్కట్లు పడుతూనే ఉన్నారు. వీటికి తోడు అధికారులు నాయకులకు వత్తాసు పలకడంతో కష్టాలు మరింత రెట్టింపయ్యాయి. తాగునీటికి మండల పరిధిలో రేగుమానిపల్లి పంచాయతీ పోతంపల్లి ఎస్సీ కాలనీ ప్రజలు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. కాలనీలో 100 కుటుంబాలు కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. రెండు సింగిల్ ఫేసు బోర్‌లు ఉన్నాయి. వాటిలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీరు రావడం లేదు. గత వారం రోజుల నుంచి నాలుగు ట్రిప్పులు ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్నారని కానీ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీరు పశువులు, ప్రజలకు సరిపోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని ఎక్కువ ట్యాంకర్లను ఏర్పాటు చేసి దాహార్తి తీర్చాలని మహిళలు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామంలో పలుమార్లు తాగునీటి కోసం కాలనీ దగ్గర గంగుపల్లి గ్రామానికి వెళ్లే తారురోడ్డుపై ధర్నాలు చేసిన విషయం తెల్సిందే. తాగునీటి సమస్య పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో కొంత మేరకు తాగునీటి సమస్య పరిష్కరించారని స్థానికులు తెలిపారు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసిన నీరు సరపడక పోవడంతో ట్యాంకర్ల వద్ద కొట్లాటలు జరుగుతున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్ కొళాయిల నుంచి త్వరగా బిందెలకు నీరు నిండదని, ట్యాంకర్ పైకెక్కి బిందెలతో నీటిని పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇటీవల టీడీపీ నియోజకవర్గం నాయకుల దగ్గరకు వెళ్లి తాగు నీటి సమస్య పరిష్కరించాలని చెప్పినా పట్టించుకున్న దాఖాలాలు లేవని కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

కురిచేడు: ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళలకు టైలరింగ్‌లో ఉచితశిక్షణ, కుట్టుమిషన్ పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ సతీష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ తరపున మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఈశిక్షణా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. మహిళలు వారిపేర్లను టైలరింగ్ శిక్షణలో లేక ఎంపీడీవో, సచివాలయం కార్యాలయాల్లో యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

90 రోజుల కుట్టుశిక్షణ ఇచ్చి ఆ తదుపరి కుట్టు మిషన్ అందజేస్తారని ఆయన తెలిపారు. మహిళల వయసు 18–45 మధ్యలో ఉండాలన్నారు. ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేసుకోవాలని ఆయ కోరారు.

బడ్జెట్ కేటాయించకపోవడం అన్యాయం



నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

దొనకొండ: దొనకొండ పారిశ్రామిక కారిడార్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడం అన్యాయమని సీపీఎం జిల్లా నాయకులు తాండవ రంగారావు అన్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కూటమి సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని అమలు పరిచేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో దొనకొండ పారిశ్రామిక కేంద్రానికి, వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించక పోవడంతో వెనుకబడిన ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడమే అవుతుందని ఆరోపించారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం దొనకొండను పారిశ్రామిక ప్రాంతంగా మార్చడం ద్వారా వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని చెప్పిన మాటలు పరిమితం అయ్యాయన్నారు. రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా దొనకొండ ప్రాంతం వెనుకబడి ఉందని ఇక్కడ చదువుకున్న యువకులకు, కార్మికులకు ఉపాధి దొరకక నిత్యం వలసలకు వెళ్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో వెలుగొండ ప్రాజెక్టు, దొనకొండ పారిశ్రామిక కేంద్రం అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మాటలు నీటిలో మూటలుగా మిగిలాయని ఆయన ఎద్దేవా చేశారు. సీపీయం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు పూర్తికి రూ.2 వేల కోట్లు కేటాయించి పూర్తి చేసి మొదటి టన్నెల్ నుంచి తాగు నీరు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించి వెలుగొండ, దొనకొండ పారిశ్రామిక కారిడార్‌ను పూర్తి చేయాలని అంజయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ తరుపున పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ముందుగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ర్యాలీగా బయల్దేరి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కర్నా హనుమయ్య, కుందుర్తి నరసింహులు, ప్రభాకర్, కర్నా క్రిష్ణ, అంజిబాబు, రమణయ్య, నరసింహులు, వెంకటయ్య, బాలకోటయ్య, అంజయ్య, వెంకటేశ్వర్లు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకోటేశ్వరరావుకు బూచేపల్లి నివాళి



పెద్దకోటేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

దర్శి (కురిచేడు): కమ్యూనిస్టు పార్టీనాయకుడు రాచపూడి పెద్దకోటేశ్వరరావు మృతదేహాన్ని దర్శి శాసనసభ్యుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం పెద్దకోటేశ్వరరావు మృతిచెందారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆ పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన కమ్యూనిస్టులు..

జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రామారావు సందర్శించి నివాళులర్పించారు. పెద్దకోటేశ్వరరావు మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాలు ప్రారంభం

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏటా ఉగాది పండగకు ముందు 4 ఆదివారాల్లో అత్యంత వైభవంగా పూజలు నిర్వహిస్తారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్ శర్మ ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు నిర్వహించారు. ఎస్‌వీకేపీ కళాశాల రోడ్డులోని పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించారు.

ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం

సంతనూతలపాడు: ఎంఆర్‌పీఎస్ సంతనూతలపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని చిలకపాడు గ్రామంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులడు తొరటి ఆనంద్‌మాదిగ మాట్లాడుతూ మాదిగ అమరవీరుల త్యాగాన్ని వృథా చేయకుండా యావత్ మాదిగ జాతి గుర్తుంచుకోవాలని తెలిపారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సేవలను పలువురు కొనియాడారు. సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేతలు పాలపర్తి శ్రీను మాదిగ, అట్లూరి అశోక్ కుమార్ మాదిగ, అట్లూరి బిక్షాలు మాదిగ, బుడంగుంట నాగేశ్వరరావు మాదిగ, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తాళ్లూరు: మండలంలోని స్థానిక నాగబొట్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2014–15 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. అనంతరం పలు విషయాలు చర్చించుకున్నారు. తాము పాఠశాలలో నేర్చుకున్న అనేక విషయాలను ఉపాధ్యాయులతో పంచుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి. అంజలి రిటైర్డ్ హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు నాగిరెడ్డి, ఆంజనేయులు ప్రభుదాసు, గీత, అల్లా రాఖీ, నాయుడు విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు